వామ్మో.. ఇవేం ఎండలు..

ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటలకే సూర్యుడు నిప్పులు చిమ్ముతున్నడు. ఎండల తీవ్రత, ఉక్కపోతతో ప్రజలే కాదు, పశువులు, జంతువులు కూడా విలవిల్లాడుతున్నాయి. ఓదెలలో ఆదివారం మధ్యాహ్నం ఓ మేక కరంట్ మోటర్ వద్ద నీరు తాగుతుండగా ఓ రైతు తన సెల్ ఫోన్‌తో ఫొటో తీసి వాట్సప్ గ్రూపులలో పెట్టాడు. ఆ ఫోటో చూసిన పలువురు వామ్మో ఇవేం ఎండలు.. మండుతున్నయంటూ చర్చించుకుంటున్నారు. ప్రజలు సైత ఇండ్ల నుంచి బయటకు రాకుండా కూలర్లు, చెట్ల కింద సేద తీరుతున్నారు. ఎండల తీవ్రతను తెల్పడానికి ఈ దృశ్యమే సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది.
ఓదెల, ఏప్రిల్ 7:

మంథని @2.39 లక్షలు

మంథని ఆర్డీవో కార్యాలయం

- నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య
- పురుషులు 1,17,271, మహిళలు 1,21,820, ట్రాన్స్ జెండర్లు 17

మంథని, ఏప్రిల్ 7: లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అదే సమయంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు జిల్లా అధికారులు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులు తీసుకుంటున్నారు.

మంథని నియోజకవర్గంలో 10మండలాల్లో ఫిబ్రవరి 8 నాటికి ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 2,39,108 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇందులో మహిళలు 1,21,820, పురుషులు 1,17,271, ట్రాన్స్ జెండర్లు 17 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు నూతన ఓటరు జాబితా ప్రక్రియను అధికారులు వేగవంతంగా నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు మృతి చెందిన వారి జాబితాను తొలగించి, కొత్త జాబితాను అధికారులు సిద్ధం చేశారు. నూతనంగా తయారు చేసిన ఓటరు జాబితాను నియోజకవర్గంలోని 10 మండలాల్లోని తహసీల్ కార్యాలయాల వద్ద అంటించడంతో పాటు బీఎల్‌వోల వద్ద జాబితాను అధికారులు అందుబాటులో ఉంచారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మంథని నియోజకవర్గంలో మొత్తం 2,39,108 మంది ఓటర్లుగా ఉన్నారని, ఇందులో మహిళలు 1,21,820, పురుషులు 1,17,271, ట్రాన్స్ జెండర్లు 17 మంది ఓటర్లుగా నమోదయ్యారు. రామగిరి మండలంలో 47 పోలింగ్ కేంద్రాల్లో 18713 మంది పురుషులు, 18568 మంది స్త్రీలు, ట్రాన్స్ జెండర్-1, కమాన్‌పూర్ మండలంలో 20 పోలింగ్ కేంద్రాల్లో 9766 మంది పురుషులు, 10081 మంది స్త్రీలు, పాలకుర్తి మండలంలోని 9 పోలింగ్ కేంద్రాల్లో 4006 మంది పురుషులు, 4151 మంది స్త్రీలు, మంథని మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో 23534 మంది పురుషులు, 24814 మంది స్త్రీలు, ట్రాన్స్ జెంర్లు 5, కాటారం మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో 14592 మంది పురుషులు, 15499 మంది స్త్రీలు, ట్రాన్స్ జెండర్ 8, మహదేవపూర్ మండలంలోని 34 పోలింగ్ కేంద్రాల్లో 12020 మంది పురుషులు, 12801 మంది స్త్రీలు, ట్రాన్స్ జెండర్ 2, పల్మెల మండలంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో 2665 మంది పురుషులు, 2800 మంది స్త్రీలు, మహాముత్తారం మండలంలోని 27 పోలింగ్ కేంద్రాల్లో 10065 మంది పురుషులు, 10311 మంది స్త్రీలు, మల్హార్ మండలంలోని 22 పోలింగ్ కేంద్రాల్లో 10774 మంది పురుషులు, 11186 మంది స్త్రీలు, ముత్తారం మండలంలోని 25 పోలింగ్ కేంద్రాల్లో 11136 మంది పురుషులు, 11609 మంది స్త్రీలు, ట్రాన్స్‌జెండర్-1 ఓటర్లుగా నమోదయ్యారు.

దరఖాస్తుల స్వీకరణ

కొత్త ఓటర్ల నమోదుకు సైతం ఈనెల 15 వరకు దరఖాస్తులు తీసుకుంటారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంచారు. 18 ఏళ్ల నిండిన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పిస్తున్నారు. విద్యాసంస్థలు సదస్సులు నిర్వహిస్తూ చైతన్యవంతులను చేస్తున్నారు.

వేంకటేశ్వరాలయంలో మంత్రి పూజలు

వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 7: మండలంలోని కన్నాల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర, మంథని నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా, సుఖః సంతోషాలతో ఉండాలని ఆ దేవున్ని మనసారా కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పర్శవేన మోహన్

ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పర్శవేన మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని మంత్రి నివాసంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మోహన్‌కు నియామక పత్రం అందజేశారు. పార్టీకి బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, తనపై నమ్మకంతోబాధ్యతుల అప్పగించిన మత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

జ్యోతినగర్, ఏప్రిల్ 7: ఎన్టీపీసీ పట్టణ పరిధి రెండోడివిజన్ పీకే రామయ్యకాలనీకి చెందిన శివానీ కుటుంబానికి ఆదివారం శ్రీ సీతారామ సేవాసమితి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం అందజేసి చేయూతనందించారు. ఇందులో సీతారామ సేవాసమితి సభ్యులు గోలివాడ శ్రీనివాస్ రూ. 1500, కార్తిక్ అనంత్‌పూర్ వాసి రూ. 1000, సేవాసమితి తరుపున రూ. 1000 చొప్పున పోగుచేసిన డబ్బులతో సరుకులు కొనుగోలు చేసి అందజేశారు. సభ్యులు గోలివాడ చంద్రకళ, కంది సుజాత, మేడి సుభద్ర, మందల రామాదేవి, మేడగోని స్వప్న, సరిత, లక్ష్మి, బిల్ల శ్రీదేవి, సిరికొప్పుల శ్రీనివాస్ ఉన్నారు.

జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టు

గ్రేడింగ్ టెస్టులో అర్హత సాధించిన కరాటే విద్యార్థులు

మంథని, ఏప్రిల్ 7: స్థానిక శ్రీ లక్ష్మీభారతి ఫంక్షన్ హాల్‌లో షోటోకాన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో 53 మందికి ఆదివారం గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన 12మందికి జూనియర్ రెడ్, 10 మందికి ఎల్లోబెల్ట్, 20 మందికి ఆరెంజ్ బెల్ట్స్, ఆరుగురికి గ్రీన్ బెల్ట్, ఐదుగురికి బ్రౌన్ బెల్టులు, ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో షోటోకాన్ కరాటే సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్ వీకే రవి, జేకేఏ సౌత్ ఇండియా ఇన్‌చార్జి రాపోలు సుదర్శన్, సీనియర్ మాస్టర్ పర్శ బక్కయ్య, శంకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ కార్యదర్శి రాజు

కమాన్‌పూర్, ఏప్రిల్ 7: మండలంలోని సిద్ధిపల్లి, పెంచికల్‌పేట, రొంపికుంట గ్రామాలలో పీఏసీఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆ సంఘం కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిననీ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధరను రైతులు పొందాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలో పాత్రధారులు

అలరిస్తున్న చిరుతల రామాయణం

ముత్తారం, ఏప్రిల్ 7: మండలం కేంద్రంలో మూడు రోజుల నుంచి ప్రదర్శిస్తున్న చిరుతల రామాయణం నాటకం స్థానికులను అలరిస్తున్నది. ఈ వేడుకలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. మూడు రోజుల నుంచి పలు ఘట్టాలను కళాకారులు ప్రదర్శించారు. నిర్వాహకులు మాట్లాడుతు యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఆధ్యాత్మిక భావన వైపు మారాలని సూచించారు. ఇక్కడ రాముడిగా పొన్నం కుమార్, సీతాదేవిగా మద్దెల దివాకర్, ఆంజనేయునిగా పరికిపండ్ల మొగిళి నటనా ప్రావీణ్యం ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఆ అక్రమాల జోలికి వెళ్లరా...?

- బల్దియాలో కూల్చివేతలు కొన్నింటికేనా...
- బడా అక్రమ నిర్మాణాల సంగతేంటి..
- రామగుండంలో పలు సందేహాలు

ఎన్టీపీసీ ఏరియాలో కూల్చివేయిస్తున్న అధికారులు(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 7: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో మాస్టర్ ప్లాన్ అమలు చేయడంలో కొత్త కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పకడ్బందీగా ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. కొద్ది రోజులుగా నగరంలోని ఆయా డివిజన్లలో ప్రధాన రోడ్లను ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలను అక్కడికక్కడే కూల్చివేస్తున్నారు. రామగుండం అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొన్నింటికేనా..? మిగతా నిర్మాణాల జోలికి కూడా వెళ్తారా? లేదా అనే చర్చ మొదలైంది. వారం రోజులుగా రామగుండం కార్పొరేషన్‌లో స్పెషల్ ఆపరేషన్ ద్వారా అక్రమ నిర్మాణాలుగా చూపుతూ అప్పటికప్పుడే కూల్చివేస్తున్న కార్పొరేషన్ అధికారులు మరింత కాలం ఆ స్థలాలను ఆక్రమించుకొన్నందుకు ఏమైనా చర్యలు తీసుకుంటారా? లేదా అని ప్రశ్నిస్తున్నారు. రామగుండం కార్పొరేషన్ అధికారులు చేపడుతున్న ఈ అక్రమ నిర్మాణాల కూల్చివేతలను నగర ప్రజలు ఒకవైపు హర్షిస్తూనే మరోవైపు ప్రశ్నిస్తున్నారు.ఈ కూల్చివేతలు కొన్నింటికేనా ? మిగతా అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లరా అంటూ పలువురు వాపోతున్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ మైదానంలో ఉన్న నిర్మాణాలు పూర్తిగా అక్రమ నిర్మాణాలే అయినప్పటికీ కేవలం కొన్ని మాత్రమే కూల్చివేసి మిగతా వాటి జోలికి వెళ్లలేదు. అలాగే లక్ష్మీనగర్ లోని ఓల్డ్ అశోక్ థియేటర్ ప్రాంతంలో మాత్రమే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. ఈ లెక్కన చూస్తే స్థానిక మార్కండేయ కాలనీ, సప్తగిరి కాలనీ, మేదరి బస్తీ, కల్యాణ్ నగర్, తిరుమల్ నగర్, దుర్గానగర్, అడ్డగుంటపల్లి , జనగామ తదితర ఏరియాలలో చాలా యేళ్లుగా నాలాలను, స్థలాలను ఆక్రమించి చాలా నిర్మాణాలు వెలిసి గతంలోనే అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క మేదరిబస్తీ, కల్యాణ్‌నగర్ లోనే నాలాలపై అనేక నిర్మాణాలు ఉన్నాయి. వీటి జోలికి కూడా వెళ్తారా.? వీరిని మినహాయింపు ఉంటుందా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకప్పుడు బొందల గడ్డలుగా, పూర్తిగా పిచ్చిచెట్లతో ఉన్న సప్తగిరి కాలనీలో ఇప్పుడు విలాసవంతమైన భవనాలు వెలిశాయి. ఆ ప్రాంతంపై కూడా దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు. మార్కండేయ కాలనీ, దుర్గానగర్, అడ్డగుంటపల్లి ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను కొంతమంది ఆక్రమించుకొని దర్జాగా నిర్మాణాలు చేపట్టారు. అడ్డగుంటపల్లి చెరువు ఒకప్పుడు ఉండేది అని చెప్పుకునే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు అక్కడ చెరువుకు బదులు అన్ని భవంతులే దర్శనమిస్తున్నాయి. ఈ విషయంలో గూడా గతంలో కార్పొరేషన్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. కార్పొరేషన్ పరిధిలో చుట్టు ప్రక్కల ఖాళీ స్థలాలు ఇప్పటికే సగం వరకు కబ్జాలోనే ఉన్నాయి. ఇప్పటివరకు రామగుండం కమిషనర్‌గా వచ్చిన ఏ ఒక్కరు కూడా ఈ అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లేంత సాహసం చేయలేదు. ప్రస్తుతం వచ్చిన కమిషనర్ అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తుండటంతో ప్రజలు ఒకవైపు హర్షిస్తున్నప్పటికీ ఈ కూల్చివేతలు ఏక పక్షంగానే జరుగుతున్నాయన్న విమర్శలు సైతం అదే తరహాలో వస్తున్నాయి. ఏదిఏమైనా ఈ అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ఎక్కడి వరకు దారి తీస్తాయో? ఎక్కడ ఆపేసి మిగతా వాళ్లను వదిలేస్తారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఉగాది పురస్కారాలను విజయవంతం చేయండి

మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 7: యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 9న శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేణ రాజేందర్ యాదవ్, ట్రస్టు జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి యాదవ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని యాదవులు, యాదవుల సంక్షేమానికి కృషి చేసిన యాదవులను గుర్తించి ఆరు విభాగాల్లో ఎంపిక చేసి ఉగాది పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు. ఏటా ఉగాది పురస్కారాలు అందజేయడం ద్వారా యాదవుల్లో స్ఫూర్తిని నింపేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 మండలాల నుంచి దాదాపు 70 నామినేషన్లు వచ్చాయనారు. ఆరుగురిని ఎంపిక చేసి ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. ఉగాది పురస్కారాలు యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి యాదవులు పెవద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల నాగరాజు, ముత్తారం మండల అధ్యక్షుడు కాసు తిరుపతి, మంద భాస్కర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ఒగ్గ కథ కళాకారుడు వెంకన్నకు కళాకీర్తి అవార్డు

వెంకన్నను సన్మానిస్తున్న నిర్వాహకులు

రామగిరి, ఏప్రిల్ 7: మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన ప్రముఖ ఒగ్గ కథ కళాకారుడు, మాజీ సర్పంచ్, జాతీయ, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించిన కొండ్ర వెంకన్నను కళాకీర్తి అవార్డు వరించింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాలులో జరిగిన ఉగాది ఉత్సవాలలో కోండ్ర వెంకన్నకు బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ తరపున కళాకీర్తి అవార్డుతో సత్కరించారు. తెలంగాణ ఉద్యమ కారుడిగానే గాకుండా ఒగ్గుకథా కళాకారుడిగా పేరు ప్రఖ్యాతలు ఉన్న వెంకన్న దేశ విదేశాలలో వేల వేదికలపై 101 దీపాలతో బోనాల ప్రదర్శనలు ఇచ్చి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి సంపాదించాడు. ఈ మేరకు బిట్ బిట్ డాన్స్ అకాడమీ తరపున ప్రముఖుల చేతుల మీదుగా కళాకీర్తి అవార్డుతో నిర్వాహకులు సత్కరించారు.

నియామకం

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 7: యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండి సతీశ్‌ను పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించినట్లు స్టేట్ యూత్ కాంగ్రెస్ ఆర్టీఐ విభాగం చైర్మన్ సల్లా నరేశ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను సమీకరిస్తు పార్లమెంట్ ఇంచార్జీలు కో-ఆర్డీనేషన్ చేసుకొని ముందుకు పోతారని తెలిపారు.

ముదిరాజ్ సంఘం ఎన్నికలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్07: మండలంలోని పెగడపల్లి లో ముదిరాజ్ సంఘం ఎన్నికలు ఆదివారం ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా తూడి సదయ్య, ఉపాధ్యక్షునిగా కల్వల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా పెండెం సదయ్య తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని సదయ్య పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించి శాలువాతో సత్కరించారు.

మత విద్వేషాలు సృష్టించే పార్టీలకు ఓటు వేయొద్దు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 7:దేశంలో మత విద్వేశాలు సృష్టించే రాజకీయ పార్టీలకు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో కూడా ఓట్లు వేయకండని మానవ హక్కుల వేధిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్క ఐలయ్య కోరారు. ఆదివారం పెద్దపల్లిలోని కూరగాయల మార్కెట్ ఏరియాలో కర పత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. దేశంలో రోజు రోజుకు మత విద్వేశాలు పెరుగుతున్నాయని ఆవేదన చెందారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, వీపరితంగా పెరిగాయని, దేశ ఆర్థిక స్థితి కూడా తీవ్రంగా దెబ్బతినడంతోపాటు రోజు రోజుకు దిగజారిపోతున్నాయని ఆవేదన చెందారు. దేశంలో ప్రత్నమాయ రాజకీయ పార్టీలు లేకుండా చేయలన్నా తలంపుతో కేంద్రప్రభుత్వం మాట్లాడే వారి గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగ్య స్ఫూర్తికి విరుద్దంగా ప్రజల మధ్య కుల, మత విద్వేశాలు రెచ్చగొట్టే రాజకీయ పార్టీలకు ప్రజలు ఓట్లు వేయరాదని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజలను గౌరవించే రాజకీయ పార్టీలకు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. వేదిక సభ్యులు అచ్యుత్‌కుమార్, కిరణ్, సదానందం, కుమార్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌తో స్నేహసంబంధాలు పెంపొందుతాయి

పెద్దపల్లి కమాన్ : ముస్లింలకు డ్రైఫ్రూట్స్ తినిపిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- ట్రినిటీ స్కూల్‌లో ముస్లింలకు ఇఫ్తార్

పెద్దపల్లి కమాన్, ఏప్రిల్ 7 : ఇఫ్తార్‌లతో హిందూ ముస్లింల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ప్రైమరీ స్కూల్‌లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కొప్పుల ఈశ్వర్, దాసరి మనోహర్ రెడ్డి ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలకు పండ్లు తినిపించి ఉపవాసాన్ని విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, తబ్రేజ్, బండారి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో

జ్యోతినగర్, ఏప్రిల్ 7: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని మసీదులో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు, ఎన్టీపీసీ ఎన్‌బీసీ మెంబర్ బాబర్ సలీంపాషా హాజరయ్యారు.

జ్యోతినగర్ : ఇఫ్తార్ లో పాల్గొన్న ముస్లింలు

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఎన్టీపీసీ జీఎంలు సాహు, హల్దర్, ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్‌కుమార్ సిద్దర్, మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బండారి కనకయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, కొలిపాక మల్లయ్య, రాజేశ్వర్, కమలాకర్‌రావు, కృష్ణయ్య, మజీద్ కమిటీ అధ్యక్షుడు మహబుబ్ అలీ, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

జ్యోతినగర్(రామగుండం), ఏప్రిల్ 7: రాష్ట్రంలో 2024-25కు గాను ఆదివారం నిర్వహించిన మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష రామగుండం జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యానం 12గంటల వరకు ఆరో తరగతిలో , మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7-10వ తరగతులకు ప్రవేశ పరీక్ష న్విహించారు.

ధర్మారం,ఏప్రిల్7:ధర్మారం మండల కేంద్రంలోని మాడల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం 166 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 149 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారు.17 మంది గైర్హాజరయ్యారు.

జ్యోతినగర్(రామగుండం): ప్రవేశ పరీక్షకు హాజరైన చిన్నారులు

అదే పాఠశాలలో 7-10 వరకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశం కోసం 73 మంది దరఖాస్తు చేసుకోగా 58 మంది విద్యార్థులు పరీక్షలు రాశానేజ పరీక్షలను పాఠశాల ప్రిన్సిపాల్ మన్నె దీన పర్యవేక్షించారు.